ఇంటి దొంగ

టెంపోరావ్

ఒక పబ్లిషింగ్ కంపెనీకి మేనేజర్‌గా పనిచేసి రామారావు రిటైరయ్యాడు. మేడమీదున్న ఫ్లాట్‌లో అతడు తన కుటుంబంతో నివసిస్తున్నాడు.

ఆరున్నర అవగానే అతడు టి.వి. ఆన్ చేశాడు. హాల్లో 40 వాట్స్ బల్బు డిమ్‌గా వెలుగుతోంది. రామారావు, భార్య కనకం, ఆమె తల్లి రాజమ్మ కూర్చుని టి. వి. తిలకిస్తున్నారు.

వాళ్ళమధ్యనుంచి గుమ్మంవైపు నడుస్తూ ఉష ఆగింది. ఉష అతడి కడసారి కూతురు. బి. ఏ. ఫైనలియ్యర్‌లో వుంది.

"అమ్మా, నేను డాబామీదకు పోతున్నాను. సౌండు మరీ హెచ్చించకండి. పైన కూర్చుని చదవలేను" అందామె.

"వెళ్ళమ్మా, చదువుకో!" అన్నాడు రామారావు. ఉష గుమ్మందాటి కుడివైపుకు తిరిగి వెళ్ళిపోయింది.

రామారావు కుర్చీలో వెనక్కి వాలి సిగరెట్ వెలిగించాడు. ఊటీలో జరిగిన ఫ్లవర్ షో దృశ్యాలు తెరమీద కదులుతున్నాయి.

సిగరెట్ పొగ వదులుతూ రామారావు చూస్తున్నాడు. వెనకనే కూర్చున్న భార్యవైపు తిరిగాడతను.

"అమ్మాయి కోసం కాఫీ చేసి ఫ్లాస్కులో పోశావుగా?" అడిగాడు.

"ఫ్లాస్కునిండా వుంది కాఫీ. కావలిస్తే మీరూ తాగొచ్చు" అందామె.

ఉషంటే అతడికెంతో ప్రేమ. ముగ్గురు కూతుళ్ళకు అతడు పెళ్ళి చేసేశాడు. బి. ఏ. పాసయ్యాక ఉషకి కూడా పెళ్ళి చేసేస్తే తన బాధ్యత పూర్తిగా తీరిపోతుంది!

నిమిషాలు గడుస్తున్నాయి. ఫామిలీ ప్లానింగ్ గురించి ఏదో చూపిస్తున్నారు. కొంచెం చూశాక అతడికి విసుగొచ్చింది. అతడు కుర్చీలోంచి లేచి బయటనున్న మెట్లవైపు నడిచాడు. మెట్లెక్కి పైకి వెళ్ళాడు. డాబా మీదున్న లైట్ వెలుగుతోంది.

విశాలమైన డాబా! పిట్టగోడ పక్కనే కూర్చుని ఉష తన చదువులో నిమగ్నురాలై వుంది. తృళ్ళిపడుతూ ఆమె తండ్రివంక చూసింది.

"మీరా నాన్నా!" అందామె.

"ఫ్లాస్కులో కాఫీవుందట. కావలసినప్పుడు తాగుతూ వుండు!" అన్నాడతను.

"తాగే పైకొచ్చాను" అందామె.

"నువ్వు చదువుకో! ఎల్లుండే గా పరీక్షలు" అని అతడు యిటూ అటూ నడవసాగాడు.

ఆకాశంలో అర్ధచంద్రుడు కనిపిస్తున్నాడు. నక్షత్రాలు మిసుకు మిసుకుమంటున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. డాబా వెనకవైపున పెద్ద టాంక్ వుంది. ఆ టాంక్‌లోని నీళ్ళు పైపుల ద్వారా కింద మేడమీద వున్న వాళ్ళకు చేరుతూ వుంటాయి.

అతడు పిట్టగోడ వారగా వెళ్ళాడు. కిందకు చూశాడు. రోడ్డుమీద జనసంచారంలేదు. కుక్కలు తిరుగుతున్నాయి. ఇది టివీల యుగం! అందరూ గదుల్లో కూర్చుని టివీలను చూస్తున్నారు. ఒకప్పుడు యిళ్ళ బయట కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకోనేవాళ్ళు యీనాడు టివీల ముందు కూర్చుని కాలాన్ని గడిపేస్తున్నారు.

ఏదో కేకవిని అతడు మెట్లవైపు పరుగెత్తాడు.

"ఏవండోయ్, మిమ్మల్నే!" అర్చింది భార్య కింద నుంచి.

"ఏమిటే?" ప్రశ్నించాడతను.

"నాటకం ప్రారంభమైంది రండి."

"గట్టిగా అరవకు! అమ్మాయి చదువుకొంటోంది" అని అతడు కిందకు దిగాడు.

తన ఫ్లాట్‌లోకి వెళ్ళే తలుపు బార్లా తెరిచివుంది. కిందకు వెళ్తూన్న మెట్లవైపు చూశాడతను. పైనున్న డాబా కిందవాళ్ళకూ, మేడమీదున్న వాళ్ళకూ వుమ్మడిగా వుపయోగపడ్తోంది.

రామారావు హాల్లోకి వెళ్ళి తన యీజీ చెయిర్‌లో వాలాడు. ఏడున్నరకు ప్రారంభమైన నాటకం ఎనిమిది దాకా సాగుతుంది. తర్వాత వార్తలు! న్యూస్ మొదలవగానే టీవీని ఆఫ్ చేయటం అతడికలవాటు.

నాటకంలో అతడు లీనమైపోయాడు. ఎనిమిదింటికి

ముగిసింది నాటకం.

"ఆ అమ్మాయిని అతడు చివరకి పెళ్ళాడ్తాడని నేను మొదటే అనుకొన్నాను. పాపం ఆమెకు ఒక కాలు లేదు. కాని ఆమె హృదయం వెన్నలాంటిది" అంది భార్య.

"ఏమిటో యీ ప్రేమలూ, పెళ్ళిళ్ళూ! కాలులేని భార్యతో ఆ యువకుడు ఎంత సుఖపడ్తాడు? రచయిత వాళ్ళిద్దర్కీ పెళ్ళి చేసి పారేశాడు!" అన్నాడు రామారావు.

ఉష కిందకొచ్చింది.

"మంచి నాటకం మిస్సయ్యావే!" అంది తల్లి.

"నా పరీక్షలయాక చూస్తానులే!" అని ఉష వంట గదిలోకెళ్ళింది.

ఫ్లాస్కులోని కాఫీని గ్లాసులో పోసుకొంది. గ్లాసును తీసుకొని పైకెళ్ళబోతూ తల్లిని చూసి ఆగింది.

"మాతో భోజనం చెయ్యవా?" అడిగింది తల్లి.

"చదవ్వలసింది చాలా వుంది. అన్నం తింటే నిద్రొస్తుంది. పది తర్వాత తింటాను. నన్నెవరూ పిలవకండి" అని ఉష పైకి వెళ్ళిపోయింది.

రామారావు బాల్కనీలో నిలబడ్డాడు. వీధి దీపాలు వెల్గుతున్నాయి. ఒకతను రోడ్డమ్మట నడుస్తూవచ్చి, గేటు తెర్చుకొని లోపలికి వెళ్ళాడు. అతడిని రామారావు గుర్తుపట్టాడు. కింద నివసించే యింటామె తమ్ముడు.

ఇంటి ఓనర్ విజయ సమీపంలో ఒక నర్సరీ స్కూలును నడుపుతోంది. భర్త రైల్వేలో పనిచేసేవాడు. ఎనభై వేలు ఖర్చుచేసి ఆ మేడను కట్టించాడు. ఇల్లుకట్టి సంవత్సరం గడిచేలోగా అతడు మోటార్ సైకిల్ యాక్సిడెంట్‌లో మరణించాడు. మేడను అద్దెకిచ్చి, తన యిద్దరు

కొడుకులతో విజయ జీవితాన్ని సాగిస్తోంది.

ఆమె తమ్ముడు దుర్గ తేనేంపేటలో వుంటున్నాడు. అప్పుడప్పుడు అక్క ఇంటికొచ్చి చూసిపోతూ వుంటాడు.

రామారావు టైమ్ చూశాడు. 8-15 దాటింది. అతడు వెనక్కి తిరిగొచ్చి యీజీ చెయిర్‌లో కూర్చున్నాడు. భార్య టీవీ ఆన్ చేసింది.

"చపాతీలు యిచ్చేస్తాను. తింటూ చూడండి" అందామె.

అతను తలాడించాడు. ఆమె వంటగదిలోకి వెళ్ళిపోయింది. అతడు ఒంటరిగా కూర్చుని "కళ్ళను కాపాడుకోండి" అనే డాక్యుమెంటరీ ఫిలిమ్ చూస్తున్నాడు. ఉష కిందకొచ్చి మంచినీళ్ళు తాగి పైకి వెళ్ళిపోయింది.

ప్లేటులో భార్య చపాతీలు తెచ్చి అతడికిచ్చింది. అతడు తింటూ టి.వి. చూస్తున్నాడు. భార్య, ఆమె తల్లి వంటగదిలో భోజనం చేస్తున్నారు. తినడం ముగించి అతడు చెయ్యి కడుక్కున్నాడు. సిగరెట్ వెలిగించాడు. టి.వి.లో ఇచ్చే ప్రోగ్రాము అంత యింట్రెస్టింగ్ గాలేక అతడు బాల్కనీలోకి వెళ్లాడు—సిగరెట్ పొగ వదుల్తూ టైమ్‌చూశాడు. తొమ్మిది దాటింది. కుక్కలు మొరుగుతున్నాయి. ఇంటి ముందునుంచి ఎవరో వేగంగా నడిచి పోతున్నారు. ఆ ఆకారాన్ని అతడు గుర్తుపట్టాడు. జయదేవ్! సమీపంలో వుంటున్నాడు. ఏదో ఇంజనీరింగ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మునుపు ఇంటికొచ్చి ఉషతో మాట్లాడుతూ వుండేవాడు. ఈ మధ్య రావటం మానేశాడు. జయదేవ్‌ని చూస్తూంటే ఏవేవో జ్ఞాపకాలు అతడి మెదడులో మెదిలాయి.

ఇంగ్లీషు పాప్ మ్యూజిక్ వినిపిస్తోంది. రామారావు

తన కుర్చీలో కూర్చుని మ్యూజిక్ వినసాగాడు. కాస్సే పర్యాక భార్య వచ్చి పక్కనే కుర్చీలో కూర్చుంది.

"మీ అమ్మ ఎక్కడ?"

"పడుకొంది" అందామె.

అతడామె భుజంమీద చెయ్యివేశాడు. ఇంగ్లీషు మ్యూజిక్ సాగుతోంది.

"డాన్స్ చేద్దామా?" అన్నాడు నవ్వుతూ.

"మన పాదాల చప్పుడు విని కిందావిడ పైకి పరుగెత్తుకొస్తుంది" అందామె.

పక్కకువంగి అతడామెను ముద్దెట్టుకోబోయాడు. ఆమె వెనక్కు జరిగింది.

"అరవై ఏళ్ళొచ్చినా మీ ఆకలి తీరలేదు!"

అతడు కిలకిల నవ్వాడు.

"కనకం, నా వయస్సు అరవై, నీ వయస్సు యాభై రెండు. మన వయస్సులు వచ్చేసరికి భార్యాభర్తలు మారమైపోతారు. యాంత్రికంగా జీవిస్తూ వుంటారు. మనలో యింకా ప్రేమ జ్యోతి ప్రకాశిస్తున్నందుకు నువ్వూ నేను ఆనందించాలి" అని అతడామెను దగ్గరగా లాక్కొని ముద్దెట్టుకొన్నాడు.

"చాల్లెండి, అమ్మాయి వస్తే బాగుండదు!"

పదిగంటలైంది. అతడు టి.వి. స్విచ్ ఆఫ్ చేశాడు. దానిమీద వెల్వెట్ గుడ్డను కప్పేశాడు. హాలులోని ఫ్లోరొసెంట్ లైట్‌ను ఆమె ఆన్ చేసింది. గదంతా కాంతిమయంగా అయింది.

అతడు టైమ్ చూశాడు. పదీఐదు అయింది.

"అమ్మాయి యింకా చదువుతోంది!" అన్నాడతను.

"కింద తలుపు వేసేయండి" అందామె.

"ఒకసారి పైకెళ్ళి చూద్దాం పద! అక్కడ చల్లగా వుంటుంది!"

"పదండి!"

ఇద్దరూ మెట్లెక్కి పైకి వెళ్ళారు.

పైన చీకటి. లైటు వెలగడం లేదు.

"అది నిద్రపోతున్నట్లుంది!" అన్నాడతను.

"చల్లగాలిలో చదవడానికి కూర్చుంటే యిలాగే అవుతుంది. పుస్తకాలు తలకింద పెట్టుకుని పడుకుంటారు" అందామె.

అతడు లైటు స్విచ్ నొక్కాడు. డాబా లైటు వెలిగింది.

రామారావు పిట్టగోడ వైపు చూశాడు. నేలమీద చాప. దానిమీద నాలుగు పుస్తకాలు, రెండు నోట్ బుక్లు వున్నాయి. అతను డాబా నలువైపులా చూశాడు. ఎక్కడా ఉష కనిపించలేదు.

"సరస్వతింటికి వెళ్ళుంటుందా?" అడిగాడతను.

"ఇంత రాత్రివేళ ఎక్కడ వెళుతుందండీ, కిందకు పోయి పడుకుందేమో!" అంది కనకం.

రామారావు వేగంగా కిందకు పరుగెత్తాడు. గదులన్నీ పరికించాడు. ముందు వరండాలో నిలబడిన భార్య దగ్గరికొచ్చాడు.

"ఎక్కడా లేదే! ఏ పుస్తకం కోసమో సరస్వతింటికి వెళ్ళుండొచ్చు. నే వెళ్ళి కనుక్కొస్తా!" అని అతడు మెట్లు దిగి కిందకు వెళ్ళిపోయాడు.

బాల్కనీలో నిలబడి ఆమె కిందకు చూస్తోంది. రామారావు రోడ్డమ్మట గబగబా నడుస్తున్నాడు. అదే రోడ్డుమీదున్న ఐదో ఇంటిముందు అతడు ఆగాడు. ఇంట్లో

దీపాలు వెలగడంలేదు. అందరూ నిద్రపోతున్నారేమో!

"సరస్వతీ! అమ్మా సరస్వతీ!" అని రామారావు పిలవడం బాల్కనీలో నిలబడిన ఆమెకు వినపడుతోంది.

సరస్వతి యింట్లో లైటు వెలిగించి. రామారావు లోపల కెళ్ళాడు. కాసేపయ్యాక అతడు రోడ్డమ్మట పరుగెడ్తూ వచ్చాడు. వీధి కుక్కలు మొరుగుతున్నాయి. అతడు గబగబా మేడ మెట్లు యెక్కాడు. ఆమె బాల్కనీలోంచి మెట్లవైపున్న గుమ్మం దగ్గరకు దూసుకు వెళ్ళింది.

"ఏవండీ, అక్కడ లేదా?"అడిగిందామె గాభరాగా.

క్షణకాలం అతడామె వంక చూశాడు. అతడి మొహంలో భయం గోచరిస్తోంది. జవాబివ్వకుండా అతడు డాబామీదకు పరుగెత్తాడు. వెనకనే వెళ్ళిందామె. మరోసారి డాబా అంతటా కలయచూశాడతను. పిట్టగోడ పక్కనున్న చాప దగ్గరకు వెళ్ళాడతను. పిట్టగోడ పక్కనే రెండు గ్లాసులున్నాయి. పుస్తకాల మధ్య పడుందొక బాల్ పాయింట్ పెన్.

"అమ్మాయి యెక్కడికి వెళ్ళుంటుందండీ?" అడిగింది కనకం.

అతడు జవాబివ్వలేదు. బుర్ర వేడెక్కుతోంది. కళ్ళు తిరుగుతున్నాయి. అతడు కుప్పలా డాబా మీద కూర్చుండిపోయాడు. కనకం భర్త దగ్గరగా వెళ్ళింది. అతడు ఒగురుస్తున్నాడు. ఆమె కొంచెం దూరంలో వున్న ఓవర్ హెడ్ టాంక్ వైపు చూసింది. గబగబా టాంక్ దగ్గరకు వెళ్ళింది. టాంక్ మూతను వెనక్కు నెట్టి అందులోని నీళ్ళను తెచ్చి అతని మొహంమీద జల్లింది. రామారావు తేరుకున్నాడు.

లేచి టాంక్ దగ్గర కెళ్ళాడు. నీళ్ళకోసం టాంక్ లోకి చెయ్యి పోనిచ్చాడు. అమాంతంగా అతడు ఉలిక్కి పడ్డాడు.

"కనకం!" అని గట్టిగా అరిచాడు.

ఆమె తొందరగా వెళ్ళింది.

టాంక్ లోకి అతడు మళ్ళా చూశాడు. దూరంలో వున్న డాబా లైటు కాంతి టాంక్ లోపలకు పడటం లేదు.

"కనకం కిందకు వెళ్ళి టార్చి పట్రా!"

కనకం గబగబా కిందకు వెళ్ళింది. కాస్సేపట్లో తిరిగొచ్చింది.

టార్చిని పట్టుకున్న అతడి చేతులు వణుకుతున్నాయి. టార్చి కాంతిలో అతడు లోపలకు చూశాడు. నీళ్ళ అడుగున టాంక్ లో ఆమె వెల్లకిలా పడుంది.

టార్చిని భార్య కిచ్చి అతడు కూతుర్ని మెల్లిగా బయటకు తీసి డాబామీద పడుకోబెట్టాడు. ఆమె చూడ్డానికి భయంకరంగా వుంది. ఏడుస్తూ కనకం కూతురి మీద వాలిపోయింది. రామారావు కూతుర్ని పరీక్షించాడు. ఆమెలో జీవం లేదు. పక్కనే కూలబడిపోయాడు. భార్య వెక్కి వెక్కి ఏడుస్తోంది. రామారావు కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

ఎవరో మెట్లెక్కి పైకొచ్చారు.

సరస్వతి!

నేలమీద పడున్న ఉషను చూసి సరస్వతి గాభరాగా అరిచింది. కాస్సేపట్లో కిందావిడ డాబామీదకు వచ్చింది. ఇరుగు పొరుగు వాళ్ళు డాబామీద గుమిగూడారు.

"పోలీసు రిపోర్టు యివ్వాలి!" అన్నాడు ఎదురింటి రామన్.

"పక్కింట్లో ఫోనుంది. పోలీసులకు ఫోను చేద్దాం!" అన్నాడు మూడో యింట్లో వుండే మూర్తి.

మూర్తి, రామన్ మెట్లు దిగి కిందకు వెళ్ళారు.

2

సుందర్ నగర్ సుందరంగా వుంది. అన్నీ కొత్త యిళ్ళు. ఒక మేడముందు డాడ్జి కారాపి దిగాను. రోడ్డు దీపాలు వెలుగుతున్నాయి. రోడ్డుమీద యాభై మంది పైగా నిలబడి వున్నారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ నా దగ్గర కొచ్చాడు.

"బ్రదర్, శవం డాబా మీదుంది, పద" అన్నాడు నాయర్.

మెట్ల ప్రాంతంలో ఒక కానిస్టేబుల్ నిలబడి వున్నాడు. ఇన్‌స్పెక్టర్ నాయర్ వెనకనే మెట్లమ్మట పైకి వెళ్ళాను. డాబామీద చల్లటి గాలి వీస్తోంది. నేలమీద పడున్న యువతి వైపు చూశాను. పొట్ట బాగా ఉబ్బి వుంది. నీళ్ళలో మునిగి, వూపిరాడక ఆమె మరణించి వుంటుందని స్పష్టంగా తెలుస్తోంది. చేతుల మీద, మొహంమీద గాట్లున్నాయి. పావడా, వోణీ లతో ఉందామె. జాకెట్, బ్రా వెనక్కు విడిపోయి వున్నాయి.

ఆమె వయస్సు యిరవై దాటి వుండదు. స్తనాలు పైకి నగ్నంగా కనిపిస్తున్నాయి. ఆమె చాలా అందమైన యువతి. మరణించిన తర్వాత ఆమె శవం వికృతంగా రూపొందింది.

విచారంతో లేచి నిలబడ్డాను. డాబా నలువైపులా

చూశాను. పిట్టగోడ వారగా ఇద్దరు కూర్చుని ఉన్నారు. ఒక కానిస్టేబుల్ గుమ్మం ప్రాంతంలో నిలబడ్డాడు. నేనూ, నాయర్ - మేం తప్ప అక్కడ మరెవ్వరూ లేరు.

"ఆయన యీమె తండ్రి రామారావుగారు. ఆయన పక్కనున్న స్త్రీ యీమె తల్లి. ఈమె పేరు ఉష. బి.ఎ. చదువుతోంది!" అన్నాడు ఇన్స్పెక్టర్ నాయర్.

డాబా మీద తిరుగుతూ నలువైపులా చూశాను. చాప, పైన పుస్తకాలు. టాంక్ దగ్గర కెళ్ళాను. మూత వెనక్కు నెట్టబడి వుంది. టార్చి కాంతిలో టాంక్‌లోకి చూశాను.

టాంక్‌లో ఎక్కువగా నీళ్ళు లేవు. మనిషి అడ్డంగా మునగడానికి సరిపోయే నీళ్ళున్నాయి. టాంక్‌లో హవాయి స్లిప్పర్లు పడున్నాయి.

జేబులోంచి ఇండియా కింగ్స్ సిగరెట్ తీసి వెలిగించాను. పొగ పీల్చి వదుల్తూ పక్కనున్న యిన్స్పెక్టర్ వంక తిరిగాను.

"నాయర్ భాయ్, ఆమె ఏదేనా వుత్తరం రాసిందా?"

"లేదు, బ్రదర్!"

ఆలోచిస్తూ నిలబడ్డాను. చల్లగాలి అఖండంగా వీస్తోంది.

"ఆమె ఉత్తరం రాసినా అది యీ గాలిలో ఎగిరిపోయి వుండొచ్చు!" అన్నాడు ఇన్స్పెక్టర్.

పిట్టగోడ వైపు చూశాను. గోడ ఎత్తుగా ఉంది. కాగితం గోడ పైనుంచి ఎగిరిపోలేదు. డాబా మీదే ఎక్కడో ఎగిరి వుండాలి. డాబాను జాగ్రత్తగా పరీ

క్షించాను. చాపమీదున్న పుస్తకాలను, నోట్ బుక్కులను తిప్పి చూశాను.

గ్లాసులను పరిశీలించాను. కాఫీ తాగిన గ్లాసు లవి. ఆలోచిస్తూ రామారావు ముందుకు వెళ్ళాను. నన్ను చూసి భార్యా భర్తలు ఏడ్వసాగారు.

"మా ఆఖరిపిల్లకీ గతి పడుతుందని ఎన్నడూ వూహించలేదు!" అన్నాడు రామారావు.

అతడివైపు సూటిగా చూశాను. అతడి ముఖంలో జీవం లేదు. ఈ బ్రతుకెందుకా అన్నట్లున్నాయి అతడి కళ్ళు.

"మీ అమ్మాయిని బ్రతికుండగా ఆఖరిసారి మీరు యెప్పుడు చూశారు?"

"ఎనిమిది ప్రాంతంలో. అది కిందకొచ్చి కాఫీ గ్లాసు పట్టుకుని పైకి వెళ్ళింది. 8-20 ప్రాంతంలో మంచినీళ్ళ కోసం వచ్చింది. అదే ఆఖరిసారి చూడ్డం."

"పైన ఆమెతో యెవరైనా ఉన్నారా?"

"ఎవ్వరూ లేరు సార్. ఏడున్నర లోపల నేనొకసారి పైకి వచ్చాను. అది ఆ చాప మీద కూర్చుని చదువుకుంటోంది!"

"ఆమె డాబామీద చదువుకుంటూన్న సమయంలో మీ రందరూ ఏం చేస్తున్నారు?"

"మేం టి.వి. చూస్తున్నాం."

"మీరు టి. వి. చూస్తూండగా ఎవరేనా పైకి రావచ్చుగా?" అడిగాను.

"రావచ్చు సార్. హాల్లో టి.వి. చూస్తూ కూర్చున్న వాళ్ళకు మెట్లమ్మట వెళ్ళే వాళ్ళు కనిపించరు" అన్నాడు రామారావు.

"మీ అమ్మాయి ఎవర్నైనా ప్రేమించిందా?"

"లేదు!"

"అది చెప్పండి!" అంది భార్య.

"ఏమిటది?"

"జయదేవ్ అనే యువకుడు అప్పుడప్పుడు మా ఇంటి కొచ్చేవాడు. ఉషతో మాట్లాడేవాడు. నేను యిక్కడకు రావద్దన్నాను. రెండు నెలల నుంచి అతడు యిక్కడకు రావడం మానేశాడు."

"ఎందుకు రావద్దన్నారు?"

"అతడు నాకు నచ్చలేదు. అమ్మాయికి పెద్ద సంబంధాలు వస్తాయని నా నమ్మకం. అతడు చిన్న ఉద్యోగంలో ఉన్నాడు. అతడికి నలుగురు చెల్లెళ్ళు ఉన్నారు. ఇద్దరు అన్నలున్నారు. అంతమంది ఉన్న కుటుంబంలో ఉష సుఖపడదని నేను భావించి అతడిని రావద్దన్నాను."

"మీకు తెలియకుండా అతడు వచ్చేవాడేమో?"

"వస్తే అమ్మాయి నాతో చెప్పకుండా ఉండదు. అతడితో స్నేహం పెంచుకోవద్దని నేను అమ్మాయితో చెప్పాను. అది సరే అంది."

"అతడు మీకు యివాళ కనిపించాడా?"

"తొమ్మిదిదాటాక నేను బాల్కనీలో నుంచున్నాను. జయదేవ్ మా యింటిముందు రోడ్డమ్మట పోతున్నాడు."

"అతడు మెట్లు దిగి వెళ్తున్నాడేమో!"

"నేను చూసేసరికి అతడు రోడ్డుమీద ఉన్నాడు."

"అతడు ఎక్కడుంటున్నాడు?"

"అతడు మొదటి రోడ్డులో నంబర్ 7 యింట్లో ఉంటున్నాడు."

"కిందభాగంలో ఎవరుంటున్నారు?"

"విజయ, ఆమె యిద్దరు కొడుకులు. వాళ్ళిద్దరూ కుర్రాళ్ళు. ఇవాళ రాత్రి ఆమె తమ్ముడు యింటి కొచ్చాడు. అతడిని నేను చూశాను."

"అతడి పేరు?"

"దొరై అని విన్నాను. నా కతనితో ఎక్కువగా పరిచయం లేదు."

"అతడు ఉషకు తెలుసా?"

"ఎలుగుబంటిలా ఉంటాడు వాడని ఆమె వెక్కిరించేది. ఉషకు అతడు తెలిసి ఉండడు."

"రామారావుగారూ, యీనాటి యువతులు పెద్దలకు తెలియకుండా అనేక మంది యువకులతో మాట్లాడుతూ ఉంటారు!" అన్నాను.

"మా పిల్ల అటువంటిది కాదు సార్!" అన్నాడు రామారావు.

వెనక్కు తిరిగాను. ఇన్స్పెక్టర్ నాయర్ తో కలిసి పిట్టగోడ దగ్గరగా నడిచాను.

"నాయర్ భాయ్, నేను కిందకు వెళ్ళి దర్యాప్తు చేసి వస్తాను. నీ పని కానీ!" అని మెట్లవైపు అడుగు వేశాను.

3

మెట్లు దిగి క్షణకాలం మేడమీది ఫ్లాట్ వైపు చూశాను, ఇంకా కిందకు దిగాను. మెట్ల గదిలో రెండు గుమ్మాలున్నాయి. ఒక గుమ్మం ముందు కానిస్టేబుల్ నిలబడి వున్నాడు. రెండో గుమ్మంవైపు వెళ్ళాను. తలుపు లోపల వైపు మూసివుంది.

సిగరెట్ వెలిగించి పొగ పీలుస్తూ ఆలోచించాను. క్రింద భాగంలో వుండేవాళ్లు యీ తలుపు తెర్చుకొని

పై డాబామీదకు మెట్లమ్మట వెళ్ళొచ్చు!

బయటకు నడిచాను. ఇంటిముందు నడవలో నిల బడ్డాను. కింద భాగంలో వుండే విజయ గుమ్మంలో నిలబడివుంది. ఆమె ముందుకు వెళ్ళాను. ఆమె వెనక్కు కదిలింది. లోపలకు వెళ్ళాను. హాల్లో ఫ్లోరొసెంట్ లైట్ వెలుగుతోంది.

"కూర్చోండి" అందామె.

కూర్చుని ఆమెవైపు సూటిగా చూశాను.

"మీరుకాక యీ ఫ్లోర్‌లో ఎవరున్నారు?" అడిగాను.

"పిల్లలు పడుకొన్నారు. పైనుంచి కేకలు విని నేను మేలుకొన్నాను. వెంటనే పైకి వెళ్ళాను" అందామె.

"మీరు పైకి ఎలా వెళ్ళారు?"

"పక్క గదిలోంచి మెట్లెకు తోవుంది. ఆ తలుపు తెర్చుకొని వెళ్ళాను."

"ఇవాళ మీ యింటికి ఎవరేనా వచ్చారా?"

"నా తమ్ముడు దొరై వచ్చాడు. వాడు ఐదునిమిషాలు కూర్చుని పనుందని చెప్పి వెళ్ళిపోయాడు."

"అతడు ఎక్కడుంటున్నాడు?"

"తేనేంపేటలో, నరసింహన్ రోడ్డు నెంబర్ 20 యింట్లో ఒకగది అద్దెకు తీసుకొన్నాడు."

"మీ తమ్ముడు ఏం చేస్తున్నాడు?"

"వుద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు."

ఆమె వైపు నవ్వుతూ చూశాను.

"అక్కయ్య యిల్లుండగా మీ తమ్ముడు తేనేంపేటలో గది అద్దెకు తీసుకొని వుండటం విచిత్రంగా వుంది!"

"ఈ యిల్లు పట్నానికి దూరంలో వుంది. తే నేం పేటలో వుంటే వాడికి సౌకర్యంగా వుంటుంది. అందుకని అక్కడుంటున్నాడు"

"ఉష మీకు బాగా తెలుసా?"

"మంచి పిల్ల సార్. రామారావుగారు చాలా మంచివాడు. ఇదంతా ఎలా జరిగిందో అర్థంకావటంలేదు" అందామె.

"మీ తమ్ముడికి ఉషతో పరిచయముందా?"

"తమ్ముడు మమ్మల్ని చూసి వెళ్ళిపోతాడు. అతడు ఎవరితోనూ ఎక్కువ మాట్లాడడు" అందామె.

"మీ హాలుకి ఎదురుగా గేటుంది - ఎవరు లోపలకు వచ్చినా ఆ గేటు తెర్చుకునే రావాలి. ఎవరేనా యీ రాత్రి పైకెళ్ళడం మీరు చూశారా?"

"లేదు సార్. తమ్ముడు వెళ్ళిపోగానే నేనూ, పిల్లలూ పడుకున్నాం."

ఆమెకు థాంక్స్ చెప్పి బయటకు నడిచాను. రోడ్డు మీద యింకా ప్రజలు వున్నారు. వాళ్ళ గుసగుసలు వినిపిస్తున్నాయి.

మొదటి రోడ్డు కనుక్కోడానికి ఎక్కువ టైమ్ పట్టలేదు. ఏడో నంబర్ బంగ్లా ముందు ఆగాను. ఇంట్లో లైట్లు లేవు. అందరూ నిద్రబోతున్నారు. డాబామీదకు వెళ్ళే మెట్లు బయట వున్నాయి.

చప్పుడు చేయకుండా మెట్లెక్కి పైకి వెళ్ళాను. డాబామీద నిలబడి రామారావు ఉండే మేడవైపు చూశాను. డాబామీద తిరుగుతున్న ఇన్స్పెక్టర్ నాయర్ కనిపిస్తున్నాడు. డాక్టర్ సుధాకర్ రూపం కనపడి మాయమైంది. శవపరీక్ష సాగుతూ ఉండాలి!

సిగరెట్ వెలిగించాను. అగ్గిపుల్ల కాంతిలో ఏదో చూసి అటువైపు చూశాను. పిట్టగోడ సమీపంలో పక్క వేసుకుని ఒక యువకుడు నిద్రపోతున్నాడు. అతడు లుంగీలో వున్నాడు. పైన బనియన్ లేదు.

ముందుకు వంగి అతడిని లేపాను. అతడు కళ్ళు నులుపు కుంటూ లేచి నా వైపు చూశాడు.

"మిస్టర్ జయదేవ్!" అన్నాను.

అతడు నా వైపు కాస్సేపు చూశాడు.

"నా పేరు మీ కెలా తెలుసు?"

"ఈ ప్రాంతంలో నీ పేరు మారుమ్రోగుతోంది!"

అతడు నవ్వాడు.

"మీరు పెద్దమనిషిలా వున్నారు. ఇంత రాత్రివేళ యిలా వచ్చారేమిటి?"

"నీతో మాట్లాడాలి!"

"దేన్ని గురించి?"

"ఉష!" అన్నాను క్లుప్తంగా.

"ఉష యింటికి నేను వెళ్ళటం ఎప్పుడో మానేశాను సార్. రామారావుగారు నన్ను రావద్దన్నారు. పెద్దలు చెప్పింది నేను పాటిస్తూ వుంటాను."

"నిన్ను చూడకుండా ఆమె వుండగలదా?" అన్నాడు మెల్లిగా.

అతను తృళ్ళిపడ్డాడు.

"మీ రెందుకలా అంటున్నారు? ఇంతకీ మీ రెవరు?"

"డిటెక్టివ్ పరశురామ్ని. నే నలా అనడానికి చాలా కారణాలున్నాయి. పెద్దవాళ్ళ లోకం వేరు, యువతీ యువకుల లోకం వేరు. పెద్దవాళ్ళు డబ్బును దృష్టిలో వుంచుకొని అంతా చూస్తారు. పద చిన్న

వుద్యోగంలా పెద్దాళ్ళకు కనపడొచ్చు. ఈనాడు ఐదు వందలు సంపాదించే యువకుడే రేపు వెయ్యిరూపాయలు గడిస్తాడు. ఈ సత్యాన్ని పెద్దలు చూడరు. జీవితం వడ్డించిన విస్తరిలా వుండాలంటారు!"

"బాగా చెప్పారు, సార్. ఉషకు నేనంటే యిష్టమే కాని ప్రస్తుతం ఆమె తలిదండ్రులకు వ్యతిరేకంగా వెళ్ళదల్చుకోలేదు."

"ఇవాళ రాత్రి ఆమెను కల్సుకొన్నావా?"

"ఎలా, సార్? అటువైపు వెళ్ళటం మానేసేగా!"

"అలా అని రామారావుకి చెప్పావు. మనసుంటే మార్గం దొరకదా!"

అతడు నవ్వాడు. పైకి చూశాడు. లేచి నిలబడి ఆమె యింటివైపు చూశాడు. లైట్లు వెల్గుతున్నాయి. ఆ కాంతిలో డాబామీద తిరిగే వాళ్ళను చూశాడతను.

"ఏమిటి సార్ ఆ హడావిడంతా?" ప్రశ్నించాడు జయదేవ్.

అతడి ముందుకు కదిలాను.

"మిస్టర్ జయదేవ్, శాడ్ న్యూస్! ఉషను ఎవరో చంపేశారు!"

అతడు కుప్పలా నేలమీద పడిపోయాడు. క్షణకాలం అతడు మాట్లాడలేదు.

"జయదేవ్, బి బ్రేవ్! పోయిన ఉష రాదు! ఇవాళ ఆమెను కల్సుకొన్నావా?"

"ఏం చెప్పమంటారు?"

"నిజం చెప్పమంటాను."

"వెళ్ళాను సార్. డాబామీదనుంచి ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రీన్ సిగ్నల్ అంటే లైట్ ఆర్పే

యాటం! నేను మెట్లెక్కి పైకి వెళ్ళాను."

"ఆమెతో ఎంత సేపు వున్నావు?"

"చాలా సేపున్నాను. తొమ్మిది ప్రాంతంలో కిందకు దిగి వెళ్ళిపోయారు. ఆయన వాల్కనీలో నిలబడివున్నారు. నన్ను గుర్తుపట్టారో, లేదో!"

"నువ్వు వెళ్ళగానే డాబామీది లైట్ ఆమె ఆన్ చేసిందా?"

"లేదు. ఆమె కిందకు వెళ్ళిపోయి వుంటుంది. భోజనం చేసి పడుకో నేముందు నేనటువైపు చూశాను. డాబా మీద లైట్ లేదు. ఆమె కిందకు వెళ్ళుంటుందనుకొని నిద్రపోయాను."

"రాత్రి తిరిగొచ్చాక నువ్వు ఆ డాబావైపు చూశావు. ఎవరేనా నీకు కనిపించారా?"

"చీకట్లో ఎవ్వరూ కనపడరు సార్. లైట్ వుంటే కనిపిస్తారు."

"నువ్వు వచ్చే టైముకి ఆమె లైట్ ఎందుకు ఆఫ్ చేసింది?"

"ఇరుగుపొరుగు వాళ్ళ కంట పడ్డం మంచిదికాదని."

"చీకట్లో మీరు ఏం చేశారు?"

"తీయగా కబుర్లు చెప్పుకొన్నాం. నేను వృద్ధిలోకి వస్తానని ఆమెకు బాగా నమ్మకముంది. తన తండ్రి మా పెళ్ళికి ఒప్పుకొంటారని ఆమె విశ్వాసం. కొంతకాలం పాటు తండ్రికి తెలియకుండా కలుసుకొందామంది. వాళ్ళు టి.వి.లో మునిగివున్నప్పుడు మేం కలుసుకొనేవాళ్ళం!"

"హఠాత్తుగా ఎవరైనా పైకివస్తే?"

"మీరు అడిగితే జ్ఞాపకమొచ్చింది. ఒక రాత్రి నేను ఆమెతో కూర్చునివుండగా పాదాల చప్పుడు వినపడింది.

గాభరాపడ్డాను. ఆమె నీళ్ళ టాంక్ వైపు చూపించింది. టాంక్ మూతను పైకెత్తి లోపల దాక్కొన్నాను. ఆమె లైట్ వేసింది. సందులోంచి చూశాను. పైకొచ్చిన వ్యక్తి రామారావుగారు కాదు."

"ఎవరు?"

"కిందావిడ తమ్ముడు దొరై. అతడు ఉషతో మాట్లాడ్డానికి ప్రయత్నించాడు. ఆమె ఇంట్రెస్టు చూపటంలేదని గ్రహించి వెళ్ళిపోయాడు. అతడు పోయాక ఆమె లైట్ ఆఫ్ చేసింది. టాంక్ లోంచి నేను బయటకు దూకాను. పాంట్, చొక్కా కొంతభాగం బాగా తడిశాయి. ఎవరొచ్చినా ఆ టాంక్ బెస్టు హైడింగ్ ప్లేస్!" అన్నాడు జయదేవ్.

"మీ యిద్దరి ప్రేమా ఎంతవరకూ వెళ్ళింది?"

"ఆమెనొక దేవతలా నేను చూసేవాడిని సార్. దగ్గరగా కూర్చున్నా ఆమెను నేనెన్నడూ ముట్టుకొనేవాడిని కాదు. మాట్లాడుకొంటూ యిద్దరం ఆనందించే వాళ్ళం."

అతడి చెయ్యి పట్టుకొన్నాను.

"దొరైని గురించి ఆమె నీతో ఏదేనా చెప్పిందా?"

"ఒకసారి ఆమె రోడ్డమ్మట వెళ్తూంటే దొరై వెంట పడ్డాడట. మర్యాద కోసం కొంత దూరం అతడితో వెళ్ళిందామె. తర్వాత ఏదో చెప్పి అతడిని వదిలించుకొందట. అతడు మంచివాడని కాదని ఆమె నాతో అంది."

"దొరైని గురించి నీకేం తెలుసు?"

"అతడి అసలు ఊరు పుదుక్కోట. అక్కడ అతను పాడైపోయాడు. తండ్రి అతడిని అక్క యింటికి

పంపాడు. సలం మారితే అతడు మారొచ్చని తండ్రి అనుకొన్నాడు. ఇక్కడికొచ్చాక అక్క యింట్లో అవీ, యివీ మాయమయ్యేవి. దానితో ఆమె అతడిని వేరే వుండమంది. దొరై తేనాం పేటలో గది తీసుకొన్నాడు."

"అతడు వుద్యోగం కోసం నిజంగా ప్రయత్నిస్తున్నాడా?"

"వుద్యోగం దొరికినా దాన్ని నిలబెట్టుకొనే వ్యక్తి కాడతను. ఒకసారి నాటుసారా తాగి రైలుపట్టాల పక్కనే తూలుతూ పోతుంటే నేనతడిని చూశాను" అన్నాడు జయదేవ్.

"విజయ ఎటువంటిది?"

"ఆమె చాలా మంచిది. ఎవర్కీ ఏ హానీ చేయదు. అన్ని విధాలా సహాయపడ్తుంది. అందుకే ఆమె అతడిని పొమ్మంది. అక్కకు తెలియకుండా దొరై వక్రమార్గంలో వెళ్తూ వుంటాడు."

వెనక్కి తిరిగి మెట్లవైపు నడిచాను. అతడు నా వెనకనే వచ్చాడు.

"పరశురామ్‌గారూ, ఒకసారి నేనొచ్చి ఆమెను చూడొచ్చా?"

"నువ్వు పూజించిన రూపం యిప్పుడు ఆమెలో లేదు!"

"రూపం మారినా, నా హృదయంలో ఆమె మీద ఏర్పడిన ప్రేమ యీ జీవితంలో తరగదు సార్!" అన్నాడతను వుద్రేకంతో.

"అనేకమంది వెళ్ళి ఆమెను చూస్తున్నారు. నువ్వూ వెళ్ళి చూడొచ్చు! ప్రస్తుతం రామారావుగారు విచారంలో మునిగివున్నారు. వెళ్ళి ఆయన్ని ఓదార్చు!" అని మెట్లు దిగాను.

రోడ్డుమీదునుంచి పైకిచూశాను. జయదేవ్ జీవం లేనట్లు, నా వైపు చూస్తున్నాడు.

4

పెడాబామీదకు చేరుకొన్నాం. డాక్టర్ సుధాకర్, ఇన్స్పెక్టర్ నాయర్ నా వైపు వచ్చారు.

"బ్రదర్, డాక్టర్ సుధాకర్ చెప్పేది నువ్వు వినాలి!" అన్నాడు నాయర్.

"పరశురామ్‌గారూ, ఉష అమానుషంగా రేప్ చేయిబడింది. ఆమె పోరాడింది. రేప్ చేసి ఆమెను చంపిన వ్యక్తి ఒంటిమీద గోళ్ళ రక్కులు వుండొచ్చు! ఆమెను టాంక్ నీళ్ళలో ముంచి అతడు చంపేశాడు" అన్నాడు డాక్టర్.

"ఆమె ఎప్పుడు మరణించి వుంటుంది?"

"తొమ్మిది తర్వాత! పోస్టుమార్టమ్ జరిగాక అంతా వివరంగా తెలుస్తుంది."

ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాను. పొగవదులుతూ మరోసారి శవంవంక చూశాను. అందమైన ఆమె మొహం చూడ్డానికి ఘోరంగా వుంది. ఆమెపడ్డ బాధ ముఖంలో వ్యక్తమవుతోంది.

రామారావు, భార్య యింకా ఏడుస్తూనే వున్నారు. ఇన్స్పెక్టర్ నాయర్ నా దగ్గరగా వచ్చాడు.

"శవాన్ని మార్చురీకి పంపుతున్నాను" అన్నాడతను.

"నాయర్ భాయ్, నేను అలా ఒకచోటకు వెళ్ళి వస్తాను. నువ్వు నీ ఆఫీసులో వుంటావా?"

"అరగంటదాకా యిక్కడుంటాను" అన్నాడు నాయర్.

మెట్లు దిగి కిందకు వెళ్లాను. డాడ్జికారులో కూర్చుని

తలుపు మూశాను. కారును మెల్లిగా ముందుకుపోనిచ్చాను. ఎదురుగా వస్తున్న వ్యక్తిని చూసి కారు ఆపాను.

జయదేవ్ విచార వదనంతో నావైపు చూశాడు.

"మిస్టర్ జయదేవ్, తొందరగా వెళ్ళు! ఆలస్యం చేస్తే శవం అక్కడ వుండదు" అన్నాను.

సమీపంలో వున్న మేడవైపు అతడు వేగంగా వెళ్ళాడు. కారును కుడివైపుకు తిప్పి పోనిచ్చాను.

ఇరవై నిమిషాల్లో తేనాంపేట చేరుకొన్నాను. నరసింహన్ రోడ్డు కనుక్కొనేసరికి తల ప్రాణం తోకొచ్చింది. ఇరవై నంబరు ఇంటిముందు కారాపి దిగాను.

పెద్ద యిల్లు. ముందువైపున్న ఒక గదిలో లైటు వెలుగుతోంది. కిటికీ దగ్గరగా వచ్చి ఒకతను నావైపు చూసి, వెనక్కు జరిగాడు. పొడుగాటి నైట్ గౌన్‌లో వున్నాడతను. గేటు కటువైపున నిలబడ్డాడతను.

"ఎవరు కావాలి?" అడిగాడతను.

"దొరై" అన్నాను.

"అతడు పొద్దుట మహాబలిపురం వెళ్ళాడు. రేపు తిరిగివస్తానన్నాడు."

"అతడు ఎక్కడుంటున్నాడు?"

"ఆ గదిలో!" అని ఒక చీకటి గదివైపు చెయ్యి చూపించాడు.

అతడి దగ్గరగా వెళ్ళాను. దొరై ఫోటో చూడకుండా యింత దూరం వచ్చినందుకు విచారించాను. ఆలోచిస్తూ అతడివైపు పరీక్షగా చూశాను. పొట్టిగా, లావుగా వున్నాడు. ప్రెజ్ నీవ్ కనుబొమ్మలు. ఏదో వాసన గాలిలో కొట్టొంది. నాటు సారా వాసన!

"మిస్టర్ నీ పేరు?"

"రాజేశ్వరన్."

"ఆ గదిలో నువ్వు అద్దెకుంటున్నావా?"

"నేను అడ్వకేటు రామాచారిగారి కొడుకుని. ఒకే గది మేం దొరెకి అద్దెకిచ్చాం."

"నీతో మాట్లాడాలి!"

"చెప్పండి!"

"నీ గదిలో కళ్దాం."

"ఇంత రాత్రివేళ మిమ్మల్ని గదిలోకి రానిస్తే నాన్నగారు తిడతారు."

"ఆయనతో కూడా మాట్లాడాలి."

అతడు తృళ్ళిపడ్డాడు.

"నాన్నగారు ఆరింటికి లేస్తారు. అప్పుడు రండి. మాట్లాడొచ్చు!"

"నువ్వు అప్పుడు వుంటావో, వుండవో!" అన్నాను.

"నేనెక్కడికి వెళ్తాను?"

"ఏ మహాబలిపురమో వెళ్ళొచ్చు!"

"నేనిక్కడే వుంటాను. ఏడువాకా నేను లేవను."

"నేను మళ్ళీ రాలేను. ఇప్పుడే నీతోనూ, నీ తండ్రితోనూ మాట్లాడాలి" అని గేటు తెరిచి లోపలకు వెళ్ళాను.

అతడు నాకడ్డుగా నిలబడ్డాడు.

"నాన్నగార్ని గురించి మీకు తెలియదేమో! ఆయన చాలా పేరుపొందిన లాయర్. క్షణంలో మిమ్మల్ని అరెస్టు చేయిస్తారు" అర్చాడతను.

అతడి చెయ్యిపట్టుకొని లైటు వెల్గుతున్న గదిలోకి యీడ్చుకుపోయాను. గోడమీదున్న మేకుకి వేళ్ళాడుతోంది ఒక ఫోటో. విజయ, ఆమె కొడుకులు ఆ ఫోటోలో

వున్నారు. గది చిందరవందరగా వుంది. చాపమీద పరుపు, నాలుగు తలగడలు. పక్కనే ఒక బాటిల్ వుంది. అందులో వున్నది నాటు సారా!

"దొరై అటువైపు గదిలో వుంటున్నాడా?" అడగాను.

"చెప్పానుగా?"

"ఆ ఫోటో ఎవరిది?"

"అమ్మది. వాళ్ళు నా తమ్ముళ్ళు."

"నువ్వు, అమ్మనే మీ అక్కతో మాట్లాడే ఇక్కడి కొచ్చాను!"

అతడు సూటిగా నా వైపు చూశాడు.

"నేను మీతో ఎన్నో అబద్ధాలు చెప్పాను. ఇదంతా అక్కయ్యకు చెప్పకండి. నన్ను యింటికి రానివ్వదు."

"ఆవాళ నీ అక్కయ్య యింట్లో ఎంతసేపున్నావు?"

"ఇలా వెళ్ళి ఐదు నిమిషాల్లో బయటికొచ్చేశాను."

"అక్కడనుంచి ఎక్కడికి వెళ్ళావు?"

"చాలా చోట్లకు వెళ్ళాను. నాటు సారా అమ్మే పాకలోకి వెళ్ళి బాటిల్ నిండా పోయించుకొని బీచ్ కి వెళ్ళాను. అక్కడ కూర్చుని కొంచెం నాటు సారా తాగాను. బీచ్ నుంచి హోటల్ ఇరోజ్ కి వెళ్ళి భోజనం చేశాను. తర్వాత నా గదికి చేరుకొన్నాను."

"నీ అక్క యింట్లోంచి బయటకొచ్చి పై డాబా మీదకు వెళ్ళలేదా?"

"వెళ్ళలేదు సార్! మేడమీదివాళ్ళు డాబామీదుంటే అక్కడకు వెళ్ళొద్దని అక్కయ్య నాకెన్నిసార్లో చెప్పింది. వాళ్ళుండగా ఎప్పుడూ పైకి వెళ్ళను. వెనక్కు తిరిగి వచ్చేస్తాను."

"ఉష నీకు తెలుసా?"

"నేను విజయ తమ్ముడినని ఆమెకు తెలుసు. ఆమె రామారావుగారి కూతురని నాకు తెలుసు. ఆమె బి.ఎ. చదువుతోందని విన్నాను. నేను 10దో స్టేండర్డు కూడా పాసవలేదు. అంత చదువుతున్న యువతులంటే నాకు భయం సార్."

"నువ్వొకసారి డాబామీదకు వెళ్ళి ఆమెతో మాట్లాడానికి ప్రయత్నించావని విన్నాను!"

"రైట్! ఒకసారి పైకెళ్ళాను. ఆమెను చూసి వెనక్కి వెళ్ళిపోయాను. ఆమే నన్ను పలకరించింది. ఆమె ఇంగ్లీషు నాకర్థంకాలేదు. కాస్సేపు అక్కడ నిలబడి నేను వెళ్ళిపోయాను."

"ఆమె బజార్ కి వెళ్తూంటే వెంటబడ్డావా?"

"ఒకసారి గబగబా వెళ్ళి ఆమెను కలుసుకొన్నాను. కాఫీ పొడుం కొనమని ఆమెతో చెప్పమని రామారావుగారు అన్నారు. ఆమెతో ఆ విషయం చెప్పి నేను వెళ్ళిపోయాను."

"రామారావుగార్ని అడిగితే నీ అబద్ధం బయట పడుతుంది."

"అడగండి! నేను చెప్పింది నిజమని తేలుతుంది" అన్నాడతను.

క్షణకాలం ఆలోచిస్తూ ఉండిపోయాను. ఇదంతా విచిత్రంగా వుంది. నా అనుమానం యితడిమీద కేంద్రీకృతమైంది. కాని ఇప్పుడు ఇదంతా నిజం కాదనిపిస్తోంది.

"ఇదంతా మీరు నన్ను ఎందుకడుగుతున్నారు?"

"ఉషను యీ రాత్రి ఎవరో హతమార్చారు!"

షాకయినట్లు అతడు నా వైపు చూశాడు.

"అక్కడ ఆత్మ గాభరా పడ్తూ వుంటుంది. నేను అక్కడికి వెళ్ళాలి!"

"ఆమె కెందుకు గాభరా?"

"తన యింట్లో హత్య జరిగింది. అది యింటికి అశుభం. రామారావుగారు మేడ ఖాళీ చేసి పోవచ్చు. హత్య జరిగిన ఫ్లాట్ లోకి ఎవ్వరూ అద్దెకు రారు."

"జయదేవ్ తెలుసా?"

"అతడిని చూశాను సార్. ఉష యింటికి తరచు వచ్చేవాడు. వాళ్ళిద్దర్నీ కాసినో థియేటర్లో ఒకరోజు చూశాను. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకొంటారని యిరుగుపొరుగువాళ్ళు అనుకొంటుంటే విన్నాను. అది ఎంతవరకూ నిజమో నాకు తెలియదు!"

అతడివైపు సూటిగా చూశాను.

"వెళ్ళి ఆమె శవాన్ని చూసే అంత స్నేహం ఆ కుటుంబంతో నాకు లేదు సార్."

గది నలువైపులా చూశాను. ఒక మూల న్యూస్ పేపర్ తో చుట్టిన పాకెట్ పడుంది. దానివైపు నడిచాను. వంగి పాకెట్ ను తీయబోయాను. అతడు వేగంగా వచ్చి పాకెట్ ను పట్టుకొన్నాడు.

"పెద్దలూ! ఇది మీకు అనవసరం సార్!"

"అందులో ఏముంది?"

"మాసిన గుడ్డలు లాండ్రీకివ్వాలని పేపర్ లో పాక్ చేసి వుంచాను."

"మాసినవా, తడిసినవా?" అన్నాను గంభీరంగా.

అతడు జవాబివ్వలేదు. పాకెట్ ను తీసుకొని గుమ్మం వైపు కదిలాడు. అమాంతంగా అతడివైపు దూకాను. నా కుడిచెయ్యి అతడి చంపకు యినపకడ్డీలా తగిలింది.

అతడు కిందపడ్డాడు.

పాకెట్ విప్పి చూశాను. పాంటీస్, అండర్ వేర్, బనియన్, షర్టు! అన్నీ తడిగా వున్నాయి. వాటిని పరీక్షించాను.

నేలమీద పడున్న దొరై మూలుగుతున్నాడు. అతడి దగ్గర కెళ్ళి అతడి ధరించిన నైట్ గౌన్ని విప్పేశాను. అడుగున మరే దుస్తులూ లేవు!

ఛాతీమీద తొడలమీద గోళ్ళతో రక్కిన గాట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కళ్ళు తెరిచి అతడు నావంక చూశాడు.

అతడి చేతులు, కాళ్ళు వణుకుతున్నాయి.

"రాస్కెల్, గెటప్!" అర్చాను.

అతడు లేచి కూర్చున్నాడు.

"ఉషను ఎందుకు చంపావు?" గర్జించాను.

"నేను చంపలేదు."

"పొట్ట చీల్చినా నువ్వు నిజం చెప్పవు. అందుకే కన్న తలిదండ్రులు నిన్ను యీ పట్నానికి పంపి చేతులు కడుక్కొన్నారు. అక్కయ్య తనింట్లోనుంచి నిన్ను బయటకు పొమ్మంది!"

అతడు మాట్లాడలేదు. మొహాన్ని చేతుల్లో కప్పేసుకున్నాడు. తడిసిన గుడ్డల్ని పేపర్లో చుట్టాను.

"గెటప్! నువ్వు నాతో రావాలి!"

"నాకేం తెలియదు సార్!"

నా చెయ్యి పైకిలేచింది. అతడు వెనక్కు జరిగాడు. అతడిని లేవదీశాను. నైట్ గౌన్ని సరిగ్గా కట్టుకొమన్నాను. పాకెట్ని అతడికిచ్చాను.

"బయటకు పద!" అర్చాను.

అతడు గుమ్మం దాటాడు. తలుపుమూసి గదికి తాళం వేశాను. తాళంచెవిని నా జేబులో పడేసుకొన్నాను.

"కారు దగ్గరకు నడువు!"

ముందు తలుపు తెర్చి అతడిని కూర్చోమన్నాను. అతడి చేతులకు బేడీలు వేశాను. తలుపు మూశాను. సిగరెట్ వెలిగించి, స్టీరింగ్ పీల్ వెనక్కి జరిగాను. కారును పోనిచ్చాను.

కారు వేగంగా కదులుతోంది. ద్రోహి మౌనంగా కూర్చున్నాడు. చల్లటి గాలి వీస్తోంది. నా మెదడులో ఉష రూపం కదిలింది. బాగా చదువుకొంటున్న యువతి! చక్కని చుక్క! ఈ దుర్మార్గుడి కామానికి ఆ అమాయకురాలు బలై పోయింది.

పళ్ళు పటపట కొరికాను. పిడికిలి బిగించాను. ఇటువంటి కిరాతకులను రోడ్డుమధ్య నిలబెట్టి కమ్చీతో కొట్టాలి! అలా చేస్తేగాని వీళ్ళకు బుద్ధి రాదు!

5

ఇన్స్పెక్టర్ నాయర్ ఎదురుగా కూర్చున్నాను. ద్రోహి గోడవారగా స్టూల్ మీద మా సమీపంలో కూర్చున్నాడు. అతడి కిరువైపులా కానిస్టేబుల్సు నిలబడ్డారు.

ఇన్స్పెక్టర్ నాయర్, నేనూ అతడిముందుకు వెళ్ళాం. మా వైపు భయంతో చూశాడతను.

"ఇవాళ జరిగినదంతా చెప్పు! అబద్ధం చేస్తే పళ్ళూడతాయి!" గద్దించాను.

"వెళ్ళిపోతున్నానని అక్కయ్యతో చెప్పి బయట కొచ్చాను. మేడమెట్లెక్కి పైకి వెళ్ళాను. లైటు వెల్గ

తోంది. అక్కడ ఎవ్వరూ లేరు. ఆమె పుస్తకాలు వున్నాయి. ఆమె కోసం వేచివున్నాను.

“ఎవరో పైకి వస్తున్నారు. నీళ్ళటాంక్ మూతను వెనక్కి నెట్టి లోపల దాక్కొన్నాను. మూతను మూసేసి కొద్దిగా ఎత్తి పట్టుకొన్నాను. అమాంతంగా లైట్ ఆరి పోయింది. ఉష, మరో వ్యక్తి చాపమీద కూర్చున్నారు. నన్ను వాళ్ళు గుర్తించలేదు. కొంతసేపయ్యాక చీకటికి నా కళ్ళు అలవాటుపడ్డాయి. వాళ్ళిద్దరూ దగ్గరగా పక్కపక్కనే కూర్చున్నారు.

“అతడు జయదేవ్ అని గ్రహించాను. వాళ్ళు తీయగా కబుర్లు చెప్పుకొంటున్నారు. ఇద్దరూ కౌగలించుకొని ముద్దెట్టుకొంటున్నారు. అదంతా చూస్తుంటే నీళ్ళలో కూర్చున్న నా ఒళ్ళు వేడెక్కతోంది!

“అతడు చాలాసేపు వున్నాడు. సమీపంలో వున్న గోడగడియారం తొమ్మిదికొట్టాక అతడు వెళ్ళిపోయాడు. ఆమె లైట్ ఆన్ చేసి చదవడం ప్రారంభిస్తుందేమో అనుకొన్నాను. కాని ఆమె లైట్ ఆఫ్ చేయలేదు. కలలు కంటూ చాపమీద పడుకొంది.

“అటువంటి సమయం కోసమే ఎదురుచూస్తున్నాను. మెల్లగా బయటకు దిగి ఆమె దగ్గరకెళ్ళాను. ఆమె నిద్ర పోతోంది! వెల్లకిలా పడుకొన్న ఆమెవంక చూశాను. జాకెట్, బ్రా పైకి తొలగివున్నాయి. నగ్నంగా వున్న ఆమె స్తనాలవైపు చూశాను.

“ఆమెమీద వాలిపోయాను. ఆమె మేలుకొంది. నన్ను గుర్తించింది. అరవబోయింది. నోరు నొక్కేశాను. ఆమె నాతో ఆడసింహంలా పోరాడింది. కాని ఆమె అబల! నా బలాన్ని ఎదిరించలేకపోయింది. నా కామాన్ని

తనివితీరా తీర్చుకొన్నాను" అన్నాడు దొరై.

"ఆమెనెందుకు చంపావు?" అడిగాడు యిన్స్పెక్టర్ నాయర్.

"నన్నామె గుర్తుపట్టింది. నా గురించి అక్కయ్యతో చెప్తుంది. ఆమె నోరును శాశ్వతంగా నొక్కేయాలి. అటువైన నాకు ప్రమాదం వుండదు. నేను డాబామీదకు వెళ్ళటం ఎవ్వరూ చూడలేదు. జయదేవ్ ఆమెతో చాలా సేపున్నాడు. అనుమానం అతడిమీదకు వెళ్తుంది. అలా ఆలోచిస్తూ ఆమెవైపు చూశాను. ఆమె మూలుగుతోంది. ఆమెను ఎత్తి తీసుకువెళ్ళి టాంక్‌లో పడేశాను. ఆమె లేవబోయింది. టాంక్‌లోకి దిగి ఆమెను నొక్కిపట్టుకొన్నాను. కొన్ని క్షణాల్లో ఆమె మరో లోకానికి చేరుకొంది. బయటకు దూకి మెట్లు దిగి, వెళ్ళిపోయాను."

అతడివైపు సూటిగా చూశాను.

"మంచి కుటుంబంలో పుట్టి నువ్విలా ఎందుకు పిశాచంగా మారిపోయావు?" ప్రశ్నించాను.

"గారాబంగా పెరిగాను. పెద్దవాడినయ్యాను. నాకు చదువు రాలేదు. నాన్న నాకు డబ్బివటం మానేశాడు. నేను బాగుపడ్తాననుకొన్నాడు. కాని నేనింకా పాడైపోయాను. ఇంటి దొంగనయ్యాను. ప్రతిరోజూ ఇంట్లో ఏదో మాయమవుతూ వుండేది. డబ్బును దొంగిలించినట్లే నా కామాన్ని కూడా రేప్ ద్వారా తీర్చుకొనేవాడిని. అక్కడుంటే వాళ్ళ గౌరవం దెబ్బతింటుందని భయపడి నన్ను యిక్కడకు పంపేశారు. ఈ పట్నంలో విజయాన్ని సాధించే క్వాలిఫికేషన్లు నాకు లేవు!

"అక్కయ్య యింట్లో దొంగతనం మొదలెట్టాను. ఒకరోజు పనిమనిషి కూతుర్ని బలాత్కరించాను. రెండు

వందలిస్తే నోరు మూసుకొంటానంది పనిమనిషి. అక్కయ్య బంగారు గాజులు అమ్మేసి, డబ్బు చెల్లించి పనిమనిషి నోరు నొక్కేశాను. కాని అక్కయ్య తన గాజుల విషయంలో నన్ను అనుమానించింది. ఇల్లు వదిలి పొమ్మంది. మరేం గత్యంతరంలేక తేనాంపేటలో గదితీసుకొన్నాను. ఆటుపైన అంతా మీకు తెలిసిందే!" అని దొరై కళ్ళు మూసుకొన్నాడు.

ఇన్స్పెక్టర్ నాయర్ తన కుర్చీలో కూలబడ్డాడు. పైన ఫాన్ తిరుగుతోంది. అతడి ఎదురుగా నిలబడ్డాను.

"నాయర్ భాయ్, వెళ్ళాలి!" అన్నాను.

"కేక్స్, టీ తెప్పిస్తాను. అవి సేవించాక వెళ్ళు బ్రదర్" అన్నాడు.

కుర్చీలో కూర్చుని మరో సిగరెట్ వెలిగించాను. ఇన్స్పెక్టర్ నాయర్ బెల్ నొక్కాడు. దొరైని కానిస్టేబుల్సు లోపలకు తీసుకుపోయారు.

—: ఐ పో యిం ది :—